

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త


# భూ రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయండి

**నెల్లూరు అర్బన్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** వైఎస్ఆర్ జగనన్న భూ హక్కు - భూ రక్ష పథకంలో భాగంగా జరుగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో వైఎస్ఆర్ జగనన్న భూ హక్కు మరియు భూ రక్ష పథకం అమలులో భాగంగా చేపట్టిన రీ సర్వే ప్రక్రియ పురోగతి, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ అంశాలపై జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌లతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు.



జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుమారు వంద సంవత్సరాల తరువాత రీ సర్వే కార్యక్రమం జరుగుతున్నందున ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా రీ సర్వే ప్రక్రియ పటిష్టంగా చేపట్టడంతో పాటు రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ రీ సర్వే ప్రక్రియలో గ్రామ స్థాయి అధికారులను భాగస్వాములను చేసి రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్యం మేరకు రీ సర్వే పూర్తి చేసి అర్హులైన రైతులకు భూ హక్కు పత్రాలను అందజేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో కొత్తగా మంజూరై చేపడుతున్న వివిధ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జిల్లాకు మంజూరైన వివిధ ప్రాజెక్టులకు కావలసిన భూములు సేకరించడంతో పాటు అడ్వాన్స్ పొజిషన్ ఇవ్వడంతో చాలా ఆలస్యమవుతుందని, ఎటువంటి జాప్యం చేయకుండా ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ ప్రక్రియను త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ, సర్వే లాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు హనుమాన్‌ప్రసాద్, కలెక్టరేట్ భూ సేకరణ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన సంవత్సరం సరికొత్త శుభాలు అందించాలి



**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలందరికీ నూతన సంవత్సరం సరికొత్త శుభాలు అందించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆకాంక్షించారు. ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురష్కరించుకుని మంత్రి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవడం శుభపరిణామమని, దీంతో పుష్కలంగా పంటలు పండి అన్నదాతలు ఆనందంగా జీవించాలని, రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు



**నెల్లూరు అర్బన్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు శుభాకాంక్షలు తెలిపారు. అన్ని రంగాల్లో జిల్లా ముందంజలో ఉందని, ఇదే స్ఫూర్తితో జిల్లా అధికార యంత్రాంగం పని చేసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రజలందరికీ అందించేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసి జలాశయాలు కళకళలాడుతున్నాయని, సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా అన్నదాతలు పుష్కలంగా పంటలు పండించుకుని ఆనందంగా జీవించాలని ఈ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో వర్థిల్లాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం సహాయ సహకారాలతో జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

## నెల్లూరు నగర ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు



**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** 2022 సంత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరంలోని అడుగు పెడుతున్న ప్రజలందరికీ నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ స్రవంతి జయవర్ధన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాబోయే నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాలలో శాంతి, సౌభ్రాతత్వాలను నింపాలని పేర్కొన్నారు. అందరి కలలు సాకారం కావాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని మేయర్ ఆకాంక్షించారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన డీఆర్‌డీఏ పీడీ



**నెల్లూరు అర్బన్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** జిల్లా ప్రజానీకానికి డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న పౌరసరఫరా కార్యాలయంలో డీఆర్‌డీఏ పీడీ కె.వి.సాంబశివరావు మాట్లాడుతూ వైఎస్ఆర్ పింఛను కానుక పథకం కింద ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా ప్రతి నెల 3,04,272 పింఛన్లను పంపిణీ చేయుచున్నారని, సాధారణంగా సిక్స్ స్టాఫ్ వాలిడేషన్‌లో భాగంగా 12,086 పింఛనుదారులకు వారి అర్హతలను ధ్రువీకరించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసులు జారీ చేయబడ్డాయి. సదరు పింఛనుదారులు వారి అర్హతకు సంబంధించి ధ్రువీకరణ పత్రం నష్టపరిహారం సంబంధిత సచివాలయంలో అందజేసినయెడల ఎంపీడీవో, ఎంపీఎల్ కమిషనర్లు విచారణ జరిపి అర్హులైన పింఛనుదారులు అందరికీ పింఛన్లు కొనసాగించబడునని తెలియజేశారు. నోటీసులు జారీ చేసిన పింఛనుదారులకు కూడా జనవరి నెలలో పింఛను మొత్తం రూ. 2750 పంపిణీ చేయబడునని తెలిపారు.

## ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



**ఆత్మకూరు, డిసెంబర్31ప్రభాతవార్త:** ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలకు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని , సరికొత్త విజయాలను పొందాలని, ప్రతి ఒక్కరూ సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు,ప్రజా ప్రతినిధులకు , మీడియా మిత్రులకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## షటిల్ బ్యాడ్మింటన్ పోటీ విజేత కావలి



**బిట్రగుంట, డిసెంబరు 31 ప్రభాతవార్త** బిట్రగుంట బ్యాడ్మింటన్ అసోసియేషన్, అమరా బచ్చు ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో బిట్రగుంట రైల్వే ఇన్స్‌టిట్యూట్‌లో జరుగుతున్న జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలో జరిగిన హోరాహోరీ పోరులో కావలి జట్టు గెలుపును కైవసం చేసుకుంది. రెండో స్థానాన్ని, మూడో స్థానాన్ని నెల్లూరు జట్లు కైవసం చేసుకోగా నాల్గవ స్థానంలో కావలికి చెందిన మరో జట్టు నిలిచింది. బెస్ట్ ఆఫ్ త్రీగా నిర్వహించగా ఈ మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగి చివరికి విజయం కావలి జట్టుకు వరించింది. మూడు సెట్ల మ్యాచ్‌లో వరుసగా రెండు సెట్లను కావలి జట్టు గెలుపొందడంతో న్యాయనిర్ణేతలు కావలి జట్టుని విజేతగా నిర్ణయించారు. విన్నర్స్‌లో రాజేష్, చందూలు, రన్నర్స్‌లో పవని, సురేష్‌లను ప్రశంసించడంతో పాటు నగదు బహుమతులు, షీల్డ్‌లు అందజేశారు.బహుమతి కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రైల్వే అధికారులు అహ్మద్‌ఖాన్,నాసర్, రాజేష్, సూపర్‌వైజర్లు అశోక్, విజయవర్ధన్, అమరా బచ్చు ఛారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ డాక్టర్ ఆనంద్‌సాగర్, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌లు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

## రేపు జై శ్రీరామ హనుమాన్ భక్తబృందం ఆధ్వర్యంలో భారీ ప్రసాదం వితరణ

**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** నగరంలోని రంగనాయకులపేటలో వెలసిన శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం నందు ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా దేవస్థానం ఆవరణలో జై శ్రీరామ హనుమాన్ భక్తబృందం ఆధ్వర్యంలో భారీ ప్రసాద వితరణ నిర్వహించినట్లు ఆ సంస్థ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో చీరాల నుంచి తెప్పించిన 2100 కేజీల సుమారు 45వేల డ్రైఫ్రూట్ లడ్డూలు, 500 కిలోల పులిహార భక్తులకు ప్రసాద వితరణ చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసు కోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జై శ్రీరామ్ హ నుమాన్ భక్త బృందం కమిటీ సభ్యులు పాదర్తి బాలాజీ, పాదర్తి సాయిబాబా, బెల్లంకొండ శ్రీనివాసులు, బాలసుబ్రహ్మణ్యం, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



**కోవూరు, డిసెంబరు31 ప్రభాతవార్త :** కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు సహకార సొసైటీ కార్యాలయ ప్రాంగణంలో 20 లక్షల వ్యయంతో నిర్మాణాలు చేపడుతున్న గోదాముల నిర్మాణ పనులను శనివారం సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి అన్నారు. పనులు కూడా సకాలంలో పూర్తయ్యేలా అధికారులు తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ పరిశీలనలో పాలకవర్గ డైరెక్టర్లు జనార్ధన్, ప్రసాద్ సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డిలు ఉన్నారు.

## 2 నుంచి కొండబిట్రగుంట రైలు గేటు మూత

**బిట్రగుంట, డిసెంబరు 31 ప్రభాతవార్త** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట-శ్రీ వెంకటేశ్వరపాళెం రైల్వే స్టేషన్ల మధ్య 146 రైల్వే గేటుని జనవరి 2 నుంచి 5వ తేది వరకు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. వాహనదారులు, ప్రయాణికులు ప్రత్యామ్నాయంగా రైల్వే గేటు 148 ద్వారా రాకపోకలు కొనసాగించాలని ఇందుకు సహకరించాలని కోరారు. రైల్వే అధికారుల నిర్ణయాన్ని ప్రయాణికులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తప్పుబడుతున్నారు. 2వ తేది ముక్కోటి ఏకాదశి సందర్భంగా కొండబిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పలు వాహనాలలో సుదూర ప్రాంతాల నుండి రైల్వే గేటు 146 ద్వారానే చేరుకుంటారని ఆ రోజు మూసివేయడం అభ్యంతకరమని ,దీనిపై రైల్వే అధికారులు వారి నిర్ణయాన్ని మార్చుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ముఖ్యమంత్రి,మంత్రిపై పోలీసులకు ఫిర్యాదుచేసిన జనసేన నాయకులు



**నెల్లూరు,డిసెంబరు31 ప్రభాతవార్త-విద్య** తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ పై అనుచిత వాఖ్యలు చేసిన రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, మంత్రి రోజాలపై తక్షణం చర్యలు తీసుకుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం జనసేన జిల్లా ప్రధానకార్యదర్శి గునుకుల కిషోర్ ఆధ్వర్యంలో నాయకులు నగరడిఎస్పీకి పిర్యాధు చేశారు. ఈ సందర్భంగా ఆయన గునుకుల మాట్లాడుతు రాష్ట్రానికి ముఖ్యమం త్రి అయి ఉంటి తమనాయకుడిపై, ఆయన వ్యక్తిగత జీవితంపై పబ్లిక్ మీటింగ్‌లో అనుచిత వాఖ్యలు చేయటం నీతిమాలిన రాజకీయాలకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలనను మరిచిన ముఖ్యమంత్రి తమ అదినేతపై , ప్రతిపక్షాల కలయికపై బయాందోళకు గురి అవుతున్నారన్నారు. నిరంతరం ఇతరుల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగిచేసే ముఖ్యమంత్రి ముందు వారి కుటుంబంలో వ్యక్తుల జీవితాలను సరిచేసుకోవాలని హితవుపలికారు. స్త్రీల మనోభావాలను కించపరిచేలా మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. హిందూ విహాహ చట్టాన్ని గౌరవిస్తూ తమ నాయకుడు నచ్చని జీవితాన్ని వదులకున్నారని, దీనిని గమనించకుండా ముఖ్యమంత్రి మాట్లాడటం చట్టాలనే అగౌరపరచటమేనని స్పష్టంచేశారు. అభివృద్ధి చేతకాని ముఖ్యమంత్రి తన అసమర్ధతను కప్పిపుచ్చుకునేందుకు ఇటువంటి దారుణమైన మాటాలు మాట్లాడుతున్నారన్నారు. మంత్రి రోజా తీరు, ప్రవర్తనను చూసే సభ్యసమాజం తలదించుకునే విధంగా ఉంటుందన్నారు. స్త్రీగా పుట్టిన రోజా మరో స్త్రీ సొంత విషయాలపై విష ప్రచారం చేయటం సిగ్గుచేటని ఆమాటలను వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. అభివృద్ధి చేతకాని దద్దమ్మ ప్రభుత్వానికి ప్రజలు రానున్న ఎని న్నకల్లో తగినబుద్ధి చెప్పాలని , గాజుగ్లాసుపై ఓటు వేసి తమను ఆదరించాలని కోరారు. అలాగే అనుచిత వ్యాఖ్యలు చేసిన వారికి శిక్షించాలన్నారు. అనంతరం ఈమేరకు ఫిర్యాదును డిఎస్పీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంధర్, అమీన్, రాజా, షాజహాన్, ప్రశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చౌకదుకాణాలను తనిఖీ చేసిన ఆర్డీవో శీనానాయక్



**కావలి, డిసెంబరు 31 ప్రభాతవార్త** కావలి ఆర్డీవో శీనానాయక్ శనివారం కావలి పట్టణంలోని కొన్ని చౌకదుకాణాలను రెవెన్యూ అధికారులతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో రేషన్ డిపో డీలర్లను ఆర్డీవో స్టాక్ వివరాలను అడిగారు. అయితే ఈ రేషన్ డిపోలో రెండు, మూడు చోట్ల వున్న బియ్యం బస్తాల వివరాల్ని ఆర్డీవో అడిగారు. అయితే చౌకదుకాణాదారులు చెప్పాల్సిన వివరాలు సాక్షాత్తు సిఎస్ డిటి పోనుగోటి వెంకట్రామిరెడ్డి చెప్పడంతో అధికారులు ఆలోచనలోకి దిగారు. రేషన్ డిపో డీలర్లతో సిఎస్ డిటిలకు వుండే సంబంధాలు చెప్పకనే చెబుతున్నాయన్న భావనలోకి అధికారులు రావడం ప్రచారం సాగింది. చౌకదుకాణాదారులు,సిఎస్ డిటిలు మిలాఖత్ అవడంతో రేషన్ బియ్యం యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌లోకి వస్తున్నాయని ప్రజలు పెద్దఎత్తున విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ తనిఖీలలో ఆర్డీవో శీనానాయక్‌తో పాటు తహశీల్దార్ మాధవరెడ్డిలు పాల్గొన్నారు. ఆర్డీవో, తహశీల్దార్లు సిఎస్ డిటిలను పక్కన పెట్టి రైస్ మిల్లర్లతో, చౌకడిపో డీలర్లతో చర్చలు జరిపితే వాస్తవాలు బయటపడతాయని వారు చెప్పడాన్ని బట్టి తెలుస్తోంది.

## మాలకొండ భక్తులకు మెరుగైన వసతులు కల్పనలో అధికారులు

### రూ.9కోట్లుతో అభివృద్ధిపనులు- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు



**వలేటివారిపాలెం డిశంబరు 31, ప్రభాతవార్త** మాలకొండ నందలి సుప్రసిద్ధ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులుకు మెరుగైన వసతులు కల్పిస్తున్నారు.ఇటీవల కాలంలో భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వహణలో పలు మార్పులు చేశారు.దర్శనక్యూ,అన్నదానం, కేశఖండనశాల, లడ్డూ కౌంటర్ ప్రత్యేక దర్శనం, మరుగుదొడ్లు, పచ్చదనం పారిశుభ్రత,తాగునీరు తదితర వసతులు నిర్వహణలో పలుమార్పులు చేశారు. దీంతో భక్తుల సంఖ్య ఆదాయం గణనీయంగా పెరిగింది. వారానికి సరాసరిన 7వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. తద్వారా వారానికి వివిద పద్దుల కింద సరాసరిన రూ.8లక్షలుకి పైగానూ, ప్రతి మూడు నెలలకొకసారి నిర్వహించే హుండీ లెక్కింపు సుమారు రూ.20లక్షలుపైగానూ స్వామివారికి భక్తులు జమచేస్తున్నారు.పెరుగుతున్న భక్తుల రద్దీని మెరుగుపర్చాల్సిన వసతులును ఆలయ కమీషనర్ కె.బి శ్రీనివాసరావు స్దానిక శాసనసభ్యులు మహీధర్‌రెడ్డితోనూ చర్చించారు.తాజాగా భక్తులకు మెరుగైన వసతలు కల్పనకు శ్రీకారం చుట్టారు.ఇందుకోసం సుమారు రూ.5కోట్లుతో మెట్లు ఆధునీకరణ,కొండపైన స్లాబులు ఏర్పాటు తదితర పనులు,సుమారు రూ.1కోటితో ఎస్.ఎస్.క్యూలైన్ ఏర్పాటు, రూ.3కోట్లుతో కొండపైన రిటైనింగు వాల్,మరుగుదొడ్లు భవనాల నిర్మాణం, కొండ కింద 28రూములు సత్రం వద్ద కాలువులు రోడ్లు తదితర పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు మెట్లు స్లాబుల ఏర్పాటు పని మినహా మిగిలిన టెండరు ప్రక్రియ పూర్తయింది.పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

**సౌకర్యవంతంగా ఎస్ ఎస్ క్యూలైన్:** గతంలో క్యూ నిర్వహణ సిబ్బందికి కష్టంగా ఉండేది.భక్తులకు అసౌకర్యంగా ఉండేది.క్యూలైన్‌లో భక్తులు బాగా ఇబ్బందులు పడుతుండేవారు.రెండు వరసల క్యూ ఉండేది. దీంతో భక్తులు గుంపులు గుంపులుగా వెళ్తుండేవారు.స్వామివారికి నైవేద్యం చెల్లించే సమయంలోనూ, భక్తుల అదిక సంఖ్యలో హాజరైనపుడు గంటల తరబడి క్యూలో నిల్లోవాల్సి వచ్చింది.తోపులాట జరిగేది. దీంతో భక్తులుకు తీవ్ర అసౌకర్యంగా ఉండేది. భక్తులు అసహనానికి గురయ్యేవారు.దివ్యాంగులు, వయోవృద్ధులు, రోగులు చాలా ఇబ్బంది పడేవారు. అదుపుచేయడంలో అధికారులు ఇబ్బంది పడేవారు.అయితే తాజాగా చేపట్టిన అభివృద్ధి పనుల్లో బాగంగా ఉచిత దర్శన క్యూనూ, ప్రత్యేక క్యూనూ, వీఐపీ క్యూనూ, అన్నదాన సత్రం వద్ద క్యూను ఎస్ ఎస్ క్యూలైన్ గా ఏర్పాటు చేశారు.మంచి స్టీల్‌తో క్యూలైన్ నిర్మించారు.భక్తుల రద్దీ ఎక్కువైన సందర్బాలలోనూ,దివ్యాంగులు, వయోవృద్దుల సౌకర్యం దృష్ట్యా క్యూలోనే కూర్చొనెందుకు అనువుగా బల్లలు అమర్చారు. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఏర్పాటుచేసిన ఎస్ ఎస్ క్యూ సౌకర్యంగా ఉందని భక్తులు హర్షం వ్యక్తుం చేస్తున్నారు.అదేవిధంగా లడ్లూకౌంటర్ వద్ద,కేశఖండనశాల తదితర ప్రాంతాలలో ఎస్ఎస్ క్యూలైన్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

**రూ.2కోట్లుతో రిటైనింగు వాల్:** మాలకొండలో కొండపైన కళ్యాణమండపం పక్కన కొండలను పగలకొటి సుమారు 200అడుగలు మేర సెకూ ్యరిటీ నిమిత్తం రిటైనింగు వాల్ నిర్మిస్తున్నారు.దీనివలన మాలకొండ భక్తులతోపాటు ఆస్థిపాస్తులకు ఎంతో రక్షణ చేకూరనుంది. ఇందుకోసం సుమారు రూ.2కోట్లు కేటాయించగా టెండర్‌ప్రక్రియలో లెస్‌తో పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే కొండపైన కేశఖండనశాల సమీపాన గల మరుగుదొడ్లు భక్తులకు ఆశించినరీతిలో చాలడం లేదు. దీంతో భక్తులు అటవీ ప్రాంతంలో అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ నేపద్యంలో సుమారు రూ.73లక్షలతో మరుగుదొడ్ల భవనాలు నిర్మిస్తున్నారు. పనులు జరుగుతున్నాయి.వీటితో పాటు కొండ కింద 28గదులు సత్రం వద్ద కాలువులు,రోడ్లు తదితర పనులు ప్రారంభం కానున్నాయి.



ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకునేందుకు జిల్లావాసులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. జనవరి 1వ తేదీన అధికారులు, నేతలు, కార్యకర్తలు, స్నేహితులు.. ఇలా అందరూ ఒకరినొకరు కలుసుకుని శుభాకాంక్షలు తెలుపుకుంటారు. దీంతో నెల్లూరు నగరంతో పాటు పలు పట్టణాల్లో స్వీట్ గిఫ్టుబాక్సులు, పూల బొకేలు ప్రత్యేకంగా ఏర్పాటుచేసి షాపుల వద్ద షామియానాలు వేసి సిద్ధం చేశారు.

ఫోటోలు: నందా మాల్యాద్రి














## కావలి నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన వంటేరు



**కావలి, డిసెంబరు 31 ప్రభాతవార్త** కావలి నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షల్ని కావలి మాజీ మాజీ ఎమ్మెల్యే, వైసిపి నేత వంటేరు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. కావలి నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో హాయిగా వుండాలని వంటేరు కోరారు.

## భవన నిర్మాణ అనుమతులకు సాంకేతిక లోపాలను సరిదిద్దండి



**నెల్లూరుటౌన్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** భవన నిర్మాణ అనుమతులను 2016 సంవత్సరం నుంచి ఏపీ డీపీఎంఎస్ సాఫ్ట్‌వేర్ సహాయంతో మంజూరు చేస్తుందని ది కంసల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఆర్కిటెక్ట్స్ అండ్ లైసెన్స్ బిల్డింగ్ సర్వేయర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ నెల్లూరు అధ్యక్షులు వి.లలితారామ్ అన్నారు. శనివారం నెల్లూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆనాటి నుంచి నేటి వరకు ఎప్పటికప్పుడు భవన నిర్మాణ నియమ నిబంధనలను అనుసరించి సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నామన్నారు. భవన నిర్మాణదారులు ఆలస్యం మరియు కాలయాపన లేకుండా వారి నిర్మాణ అనుమతిని పొందే విధంగా ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించడమైందన్నారు. గత ఆరు సంవత్సరాలుగా ఈ సాఫ్ట్‌వేర్‌లో ఎన్నో మార్పులు చేసినప్పటికీ ఇంకనూ కొన్ని ఇబ్బందులను నిర్మాణ దరఖాస్తుదారులు ఈ యొక్క దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా అప్లయి చేస్తున్నటువంటి ఎల్‌టీపీలు ఎదుర్కొంటున్నారు. వేకంట్ లాండ్ టాక్స్ ఖాళీ స్థలం పన్ను విధింపు కొరకై ఆన్‌లైన్‌లో ఈ సాఫ్ట్‌వేర్‌లోనే నమోదు చేసుకునేటువంటి అవకాశం ఉందని, కానీ అందులో సమాచారం నమోదు చేసిన వివిఎల్‌టి విధింపు జాప్యం జరుగుతూనే ఉంది. ఈ కారణం చేత భవన నిర్మాణ అనుమతి మంజూరులో కాలయాపన జరుగుతుందని భవన నిర్మాణ అనుమతికి అవసరమగు ఫీజులు ఏ విధంగా అయితే జనరేట్ అవుతున్నాయో అలాగే ఈ వేకెంట్ ల్యాండ్ టాక్స్ కూడా జనరేట్ చేసే విధంగా సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయాలని ఈ సందర్భంగా కోరుకుంటున్నామని, నిర్మాణ అనుమతుల విషయంలో సమాచారం నమోదులో ఏ ప్రాంతంలో జరుగుతుందో తెలియజేసినప్పుడు ఆ ప్రాంతానికి అనుగుణంగా ఆ ప్రాంతం ఏ వార్డు సెక్రటేరియట్ అనుసంధానించబడిందో వార్డ్ సెక్రటేరియట్ యొక్క కోడ్ ఆటోమేటిక్‌గా జనరేట్ అయ్యేలా ఈ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయాలని కోరుకుంటున్నామన్నారు. ప్రాంతంతో సంబంధం లేకుండా నగరంలో ఉండేటువంటి అన్ని సచివాలయాల నంబర్లను తెలియజేస్తుంది. ఆ కారణం చేత ఆ ప్రాంతానికి సంబంధించిన సచివాలయాలను ఎన్నుకోవడంలో జాప్యం జరుగుతుంది. అలాగే తప్పులు జరుగుతున్నాయని, నిర్మాణం జరుగు ప్రాంతం యొక్క వార్డు వివరాలు నమోదు చేసే ప్రక్రియలో కూడా కొంత తికమకలు ఉన్నాయి. ఇవి రెవెన్యూ వార్డు సంబంధించినవా లేక ఎన్నికలు జరుగు డివిజన్‌లో నెంబర్లు అనే సందిగ్ధం ఉంది. ఈ కారణం వలన ఆ ప్రాంతానికి సంబంధించిన సర్వే నెంబర్లు నమోదు చేయడంలో ఇబ్బందిగా ఉంది. అలా కాకుండా ఆ ప్రాంతాన్ని నమోదు చేయగానే ఆ ప్రాంతంలో ఉండేటువంటి సర్వే నెంబర్లు మాత్రమే ఎన్నుకునే విధంగా సాఫ్ట్‌వేర్‌లో మార్పు చేయవలసిందిగా కోరుకుంటున్నాము. సార్క్ నిర్మాణ అనుమతి కోరు ప్రాంతానికి సంబంధించి ఆ యొక్క ప్రాంతం అప్రూవ్డ్ ఆ కాదా అనే సూచికలో గతంలో అనుమతించిన ప్లాను అనేటువంటి ఒక ఆప్షన్ ఉంటే బాగుంటుంది. దీని వలన గతంలో అనుమతి పొందిన భవన నిర్మాణదారులు పై అంతస్తులు లేదా అనుమతి ఉన్న నిర్మాణానికి అదనపు నిర్మాణం చేసుకునే దరఖాస్తుకు వెసలుబాటు కలుగజేస్తుంది. అలాగే గతంలో అనుమతి పొందిన ఆ ప్లాను తాలూకా డాక్యుమెంట్లు అన్నియు కూడా డాక్యుమెంట్లకు అప్‌లోడ్ చేయు ట్యాబ్ నందు అటాచ్‌మెంట్ రూపంలో కనిపించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుకుంటున్నాము. వాటికి అదనంగా అవసరమైన డాక్యుమెంట్లను జత చేయుటకు ఆప్షన్ పొందుపరచవలసిందిగా కోరుతున్నాను. ఈ సమావేశంలో సెక్రటరీ కె.శ్రీనివాసరావు, ట్రెజరర్ కె.రామరాజు, వైస్ ప్రెసిడెంట్ ఎం.విజయ్‌ప్రసాద్, యు.గిరీష్, ఎండి షబ్బీర్, మల్లికార్జున్, సత్యనారాయణ సింగ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ శ్రీధర్ జన్మదినానికి మొక్కలు నాటిన నేతలు



**కావలి, డిసెంబరు 31 ప్రభాతవార్త** కావలి ఐయంఎ కార్యదర్శి, శ్రీధర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు, సంయుక్త సేవా సంస్థ గౌరవ సభ్యులు డాక్టర్ పి.శ్రీధర్ జన్మదినం పురస్కరించుకొని ముసునూరు గిరిజన గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర, లోక్‌సత్తా మాలకొండారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌సుధాకర్, ఐసిడిఎస్ ఉద్యోగి సాయి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు మొక్కలు నాటారు. డాక్టర్ శ్రీధర్ పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటడం ఎంతో ఆనందంగా వుందన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు.

## నేడు కలిగిరిలో యస్‌ఇబి స్టేషన్ నూతన ప్రారంభం

**కలిగిరి, డిశెంబర్31, ప్రభాతవార్త;** నేడు కలిగిరిలో (ఆదివారం)యస్‌ఇబి స్టేషన్ నూతన ప్రారంభం జరుగుతుందని స్టేషన్ యస్ హెచ్‌ఓ యస్ ప్రబాకర్‌రావు తెలిపారు. ఆంద్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులమేరకు యస్‌ఇబి స్టేషన్‌ను ఆదివారం కిగిరిలో ప్రారంబించడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు ఈ కార్యాలయం వింజమూరులో ఉండగా పై అధికారుల సూచనల మేరకు కలిగిరికి మార్చడం జరుగుతుందన్నారు. ఈ యస్ ఇబి కార్యాలయంనం పనితీరును గురించి వివరిస్తూ ప్రభుత్వ వ్యతిరేకపనులు అనగా అక్రమ మద్యం విక్రయాలు, నాటుసారా అమ్మకాలు, గంజాయి, అక్రమ ఇసుక రవాణా, పేకాటలు, కోడి పందాలు లాంటి సంఘవ్యతిరేక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపడం జరుగుతందన్నారు. ఇలా అక్రమాలకు పాల్పడుతున్న వారి వివరాలు తెలిపేందుకు 9440902523నంబరుకుగానీ, 14500టోల్‌ఫ్రీనంబరుకు గానీ సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాంటి సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడుతాయన్నారు. ఈ స్టేషన్ పరిదిలో 4మండలాలు ఉంటాయన్నారు. ఇందులో కలిగిరి, వింజమూరు, వరికుంటపాడు, కొండాపురం మండలాలు ఉంటాయన్నారు.

## ఇన్నోవా హైక్రాస్ ధరలను ప్రకటించిన టయోటా

**నెల్లూరు, డిసెంబరు31 ప్రభాతవార్త-విద్య** టయోటా కిర్లోస్కర్ మోటాం(టీకెఎం) వారి నూతన ఉత్పాదన ఇన్నోవా హైక్రాస్‌ధరలను శనివారం విడదుల చేయటం జరిగిందని సంస్థ మారెక్టింగ్‌అసోసియేట్ ఉపాధ్యక్షులు అతుల్‌సూద్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంతో ప్రజా దరణ పొందిన ఇనోవా సెగ్మెంట్‌లో నూతనంగా విడుదల చేసిన ఈవాహనం ధర 1830000 వేలనుండి 2897000 వరకు ఉంటుందన్నారు. గత నెలలోనే తమ సంస్థ ఈ కారుకు బుకింగ్స్‌కు కూడా ప్రారంబించటం జరిగిందన్నారు. తమ వాహనంలో స్పీడ్ లిమిట్ ఫంక్షనింగ్, నాణ్యత, విశిష్టతను కలిగి ఉందన్నారు. అత్యంత అత్యాధునిక హంకులు, ఆకర్షించే అంశాలు కలిగిన ఇన్నోవా హైక్రాస్ అందరని మన్నలను అందుకోనుందన్నారు. వాహనదారుకల భద్రతలకు అధిక ప్రాధ్యాన్యతను తాము కలిపిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ వాహనంలో 5వ తరపు చార్జింగ్, ఎంతో మన్నికైన హైబ్రీడ్ ఎలక్ట్రికల్ వ్యవస్థ, 2.0 లీటర్ 4 సిలెండర్ ఇంజన్‌తో పాటూ 137కిలోవాట్స్, 183.7 హెచ్ పి టార్క్‌ను ఉత్పత్తి చేస్తుందన్నారు. సూపర్ వైట్, ప్లాటినమ్ వైట్, బ్లాక్ మికా, సిల్వర్ మెటాలిక్, ఆటిట్యూడ్ బ్లాక్ మికా, రంగుల్లో లబిస్తుందన్నారు. అలాగే అందరికి అందుబాటు దరల్లో 8సంవత్సరాల నిభందనల వారంటీ, 160000 కిలోమీటర్ల వారెంటీని తాము అందిస్తున్నామన్నారు.

## బైరి నరేష్‌పై పీ.డి యాక్ట్ నమోదు చేయాలి




**పొదలకూరు డిసెంబర్ 31 ప్రభాతవార్త** హిందువుల మనోభావాలు దెబ్బతీస్తు అయ్యప్పస్వామి పుట్టకను అవమానిస్తు అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై పోలీసులు ఐపిసి సెక్షన్ 295, 502 ,పిడి యాక్ట్ కేసు నమోదు చేయాలని పొదలకూరు హిందు ధర్మ చైతన్య సమితి సభ్యులు గంగవరపు వేణుగోపాల్‌రెడ్డి బొద్దులూరి మల్లికార్జుననాయుడు చొప్పా వెంకటేశ్వర్లు, అల్లూరు రమణయ్య, ముత్తుస్వామి డిమాండ్ చేశారు. శనివారం పట్నంలోని గేట్ సెంటర్ నుండి పోలీస్‌స్టేషన్ వరకు బైరి నరేష్ వ్యాఖ్యలకు నిరసనగా నినాదాలు చేస్తు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఐ ఖరిముల్లాకు వినతి పత్రం అందజేశారు. అయ్యప్పస్వామిని అవమానించిన బైరి నరేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అయ్యప్ప భక్తులతోపాటు హిందు ధర్మ చైతన్య సమితి రాజకీయపార్టీనాయకులు కోరారు. అంతే కాకుండా బైరి నరేష్ యూటూబ్ చానల్‌ని కూడా నిషేదించాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిరిగిరి ఓబులేసు, చిరంజీవి, జనార్ధన్‌రెడ్డి, కాశినాయన, స్వామి, రాచపూటి రాజేష్, రవినాయుడు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకోసమే ట్యాబ్‌లు పంపిణీ




**బుచ్చి డిసెంబర్ 31ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాల పి.ఆర్.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు పంపిణి చేశారు. ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు, సర్పంచ్ లఘంతోటి బాగ్యలక్ష్మి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతు విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్తు అందించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారని వారుతెలిపారు. విద్యార్థులందరు ఈ అవకాశాన్ని సది్వినియోగ చేసుకొని " జగన్‌మామ " మీకుకోసం చేసు న్న కృషికిఉత్తమ ఫలితాలు సాధించాలని కోవూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి మంచి పేరు తీసుకొని రావాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో విద్యాకమీటి చైర్మన్ వెంకటేశ్వర్లు, విద్యాకమీటి కో .ఆప్టెడ్ మెంబర్ లఘంతోటి మస్తానయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెన్షన్ల రద్దు విరమించుకోవాలి



బుచ్చి డిసెంబర్ 31 ప్రభాతవార్త వివిధ కారణాలతో ఇప్పటివరకు వస్తున పెన్షన్లను ప్రభుత్వం తొలగించే ప్రక్రియను విరమించుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేస్తు ఎంపిడిఒకి వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతు ప్రభుత్వం 2750 రూపాయాలు పెన్షన్‌కి ఇస్తు న్నట్లు ప్రకటించి భారాన్ని తగ్గించుకునేందుకు పెన్షన్ల కోతపెట్టడం సరికాదని అన్నారు. విద్యుత్ యూనిట్లు 3 వందల లింకుపెట్టి తీసివేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. వెయ్యి చదరపు అడుగుల కన్నా ఇంటి నిర్మాణం ఉంటే పెన్షన్ రద్దు చేయమనడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఆదాయపన్ను లేని వారికి ఆదాయ పన్ను కడుతున్నట్లు, భూమిలేని వారికి భూమి ఉన్నట్లు ఇలా రకరకాల కారణాలతో పెన్షన్లు ఎత్తివేయడం సబబుకాదని అన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ నరసింహారావుకి వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తంబి రమణయ్య, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి గరికపాటి సురేష్, సి.ఐటియు మండల కార్యదర్శి మలికార్జున, ఖాదర్‌భాషా, వెంకోజి, జానీ, బాలు, బాలకోటయ్య, దత్తశ్రీ కోటయ్య, మాల్యాద్రి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన వారిపై కేసులు పెట్టాలి



**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** రెండు రోజుల క్రితం తెలంగాణాలో ఓయూ స్టూడెంట్ కొడంగల్ నియోజకవర్గంలో నిర్వహించిన అంబేద్కర్ సభలో అయ్యప్ప స్వామిని కించపరిచేలా దారుణమైన వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్ అనే వ్యక్తి పైన పీడీ యాక్ట్ కేసు నమోదు చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు యశ్వంత్ సింగ్ శనివారం నగరంలోని సంతపేట సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మేము నాస్తికులం, దేవుడిని నమ్మం, అంబేద్కర్ సభ అంటేనే నాస్తికుల సభ అని బహిరంగంగానే దేవునిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడని ఆరోపించారు. అయ్యప్పస్వామిని, జననాన్ని, పురాణాన్ని కించపరుస్తూ వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. బైరి నరేష్‌పై నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఏజెన్సీ (ఎన్ఐఏ) ద్వారా విచారణ చేయాలని కోరారు.


# ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు




**గుడ్లూరు, డిసెంబరు 31, ప్రభాతవార్త** నూతన సంవత్సరం సందర్భంగా మండల ప్రజలు, యువకులు ప్రశాంతకరమైన వాతావరణంలో ఆనందంతో వేడుకలు జరుపుకోవాలని ఎస్సై ప్రసాదరెడ్డి తెలిపారు. ముందుగా మండల ప్రజలకు పోలీసు శాఖ తరుపున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, 31రాత్రి జనవరి 1ను పురస్కరించుకుని ఎవరైనా మద్యం సేవించి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, వాహనాలు నడిపిన అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని బహిరంగ ప్రదేశాల్లో కేకులు కట్ చేయడం, ప్రజా రవాణా వ్యవస్థకు అసౌకర్యం కలిగించడం ప్రజల శాంతికి భంగం కలిగించడం తగదని యువత బైకులపై ముగ్గురు అంతకంటే ఎక్కువగా ప్రయాణిస్తూ గట్టిగా అరుస్తూ సైలెన్సర్లు లేకుండా బైకులు నడపటం వంటి అసౌకర్యం కలిగించడం లాంటి చర్యలు చేసినట్లయితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# జిల్లాలో సైకో చేష్టలు పెరిగిపోయాయి: చంద్రబాబునాయుడు





**కొడవలూరు(నెల్లూరు), డిసెంబరు 31, ప్రభాతవార్త:** వైసీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి గంజాయి, డ్రగ్స్ అమ్ముకునే పరిస్థితికి వచ్చారు. కాబట్టి ఆంధ్రప్రదేశ్ హబ్‌గా మారే పరిస్థితికి వచ్చిందని మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కొడవలూరు మండలం నార్త్‌రాజుపాళెంలోని పిఎస్ఆర్ కళ్యాణ మండపం వద్ద శనివారం మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీడీపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పరిస్థితులపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో సైకో చేష్టలు పెరిగిపోయాయని, దీంతో ప్రజలకు స్వేచ్ఛ కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2022 విధ్వంసుల ఏడాదిగా మారిపోయిందన్నారు. ఈ ప్రభుత్వంలో ప్రజలు, నేను కూడా మానసిక క్షోభ అనుభవించామని తెలిపారు. మనమందరం బాధపడుతుంటే వైఎస్ జగన్ ఆనందపడుతున్నారని ఎద్దేవా చేశారు. అందుకే జగన్‌రెడ్డిని సైకో అన్నానన్నారు. ఈ ప్రభుత్వంలో 48 రకాల పన్నులు ప్రజలపై మోపిందని సీఎంగా పని చేసిన నాకు ఇప్పటివరకు ఇన్ని పన్నులు ప్రజలపై వేయొచ్చు అని తెలియదన్నారు. జగన్ సర్కారులో 1600 మంది పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. ఏపీలో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా దొరుకుతున్నాయని, మద్యం ఏరులై పారుతున్నాయన్నారు. ఈ సమావేశంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, అబ్దుల్ అజీజ్, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పార్టీకి రాజీనామా చేసిన రామిరెడ్డి కృష్ణారెడ్డి



**కావలి రూరల్, డిసెంబరు 31 ప్రభాతవార్త** భారతీయ జనతా పార్టీ నాయకుల వ్యవహారాలతో విసుగు చెంది పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు రామిరెడ్డి కృష్ణారెడ్డి తెలియ జేశారు. కావలిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కృష్ణారెడ్డి మాట్లాడారు. బిజెపి పార్టీ కోసం ఎన్నో కార్యక్రమాలు చేసి పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశానన్నారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు తనను ఎంతగానో బాధించాయన్నారు. బిజెపి అధిష్టానానికి రాజీనామా చేస్తున్నట్లు లేఖ కూడా పంపడం జరిగిందని తెలిపారు. త్వరలో ఏ పార్టీలో చేరేది అనుచరులతో చర్చించి తెలియజేస్తానన్నారు. తాను కావలి మాజీ శాసనసభ్యులు స్వర్గీయ గొట్టిపాటి కొండపనాయుడు అనుచరుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించానన్నారు. ఆయన రాజకీయాలు వేరు అని ప్రస్తుతం బిజెపిలో రాజకీయాలు వేరు అని చెప్పారు. 2014లో బిజెపి పార్టీలో జిల్లా నాయకులు సురేష్‌రెడ్డి నాయకత్వంలో పార్టీలో చేరడం జరిగిందన్నారు. కావలి చెరువుల రైతుల కోసం జలదీక్ష చేశానన్నారు. రాష్ట్రంలో విద్యుత్ కనెక్షన్లు నిలుపుదల చేస్తే దాన్ని ఎత్తివేయాలని 19 రోజులు కావలి ఎలక్ట్రికల్ కార్యాలయంలో నిరాహారదీక్ష చేపట్టడం జరిగిందని తెలిపారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి చితాభస్మం కావలికి వస్తే దర్శించుకోవడం జరిగిందని తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను బ్రహ్మంగారి వేషధారణి ధరించి కావలి రూరల్ మండలంలో ప్రజల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. బిజెపి అగ్రనాయకులు ఎల్.కె.అద్వానీకి రాష్ట్రపతి పదవి ఇవ్వాలని నిరాహారదీక్ష చేయడం జరిగిందన్నారు. ఇక నుండి బిజెపి పార్టీకి నాకు ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. ఈ సమావేశంలో రామిరెడ్డి కృష్ణారెడ్డి అనుచరులు, అభిమానులు పాల్గొన్నారు.

## జాబ్ కార్డ్స్ ఆధార్ సీడింగ్ మరింత వేగవంతం కావాలి



**కోవూరు, డిసెంబరు31 ప్రభాతవార్త :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డు పొందిన వారికి సంబంధించిన వాటికి ఆధార్ సీడింగ్ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని ఎంపీడీవో శ్రీహరి పేర్కొన్నారు. కోవూరులోని డ్వామా కార్యాలయంలో శనివారం ఆయన కంప్యూటర్‌లో నమోదైన వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 9428 జాబ్ కార్డులు ఉన్నాయని, మొత్తం ఈ కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసేలా డ్వామా సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఏపీవో సుబ్బారావు ఉన్నారు.

## అడ్డంకులు సృష్టించినా సభ విజయవంతం



**కోవూరు, డిసెంబరు31 ప్రభాతవార్త :** జాతీయ టీడీపీ అధ్యక్షుడు , మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు సంబంధించి పోలీసులు, వలంటీర్లు ఎన్ని అడ్డంకులు సృష్టించినా సభ ఊహించిన విధంగా విజయవంతం అయిందని ఇందుకు సహకరించిన నాయకులు, కార్యకర్తలకు పాదాభివందనం చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. కోవూరులోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సభ ఎక్కడ విజయవంతం అవుతుందనే అక్కసుతో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అనేక అడ్డంకులు సృష్టించాలని , ఇటు పోలీసులకు, అటు వలంటీర్లకు సూచనలిచ్చినా ప్రజలు స్వచ్ఛందంగా ఈ సభకు వచ్చి విజయవంతం చేశారన్నారు. చంద్రబాబు నాయుడు కూడా సభ విజయవంతం కావడం పట్ల ధన్యవాదాలు కూడా తెలియజేశారన్నారు. రానున్న ఎన్నికలు ప్రసన్నకుమార్‌రెడ్డికి రాజకీయ సమాధి కట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అవ్వాతాతలు, వితంతువుల గోడు ఈ ప్రభుత్వానికి తప్పక తగులుతుందన్నారు. అధికారులు కూడా ఈ విషయంలో బలి పశువులు కావద్దని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా చంద్రబాబు పర్యటనకు ఐదు మండలాలకు సంబంధించిన పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయం చేసుకుని వారం రోజుల పాటు శ్రమించారన్నారు. చంద్రబాబు కూడా పూర్తిగా జోష్‌లో ఉన్నారని ఈ సందర్భంగా తెలియజేశారు. పూర్తిస్థాయిలో సభ విజయవంతం కావడం పట్ల దినేష్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ ఇన్‌చార్జి దినేష్‌రెడ్డి మాట్లాడుతూ సభ విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగిస్తూ రానున్న ఎన్నికల్లో చంద్రబాబు నాయుడుని తిరిగి ముఖ్యమంత్రి చేసేవరకు విశ్రమించరాదన్నారు. ఇప్పటికే ప్రజలు ఈ ప్రభుత్వంపై పూర్తిస్థాయిలో ఆవేదనలో ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ కనుమరుగు కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, వీరేంద్ర, అమరేంద్రరెడ్డి, లేగుంటపాడు సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి కృష్ణచైతన్య, పార్టీ సీనియర్ నాయకులు బాల రవి, నాటకరాణి వెంకట్, సుబ్బానాయుడు, బి. విజయ్‌కుమార్, శ్యామ్, ఆంజనేయులు, ఫిరోజ్, వెంకటరమణమ్మ, హరిబాబు , తదితరులు ఉన్నారు.

## రాధన్నకు ముందస్తు అభినందనల వెల్లువ



కోవూరు, డిసెంబరు31 ప్రభాతవార్త : కోవూరు ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డిని రానున్న నూతన సంవత్సర పర్వదినాన్ని పురస్కరించుకుని రైల్వే ఫీడర్స్ రోడ్‌లోని అతిథి గృహంలో శనివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది, అభిమానులు పెద్దఎత్తున పూలమాల శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారందరికీ తేనేటి విందును ఏర్పాటు చేశారు. వైసీపీ నాయకులు అనూప్‌రెడ్డి,జగదీష్‌స్వామి, సాయియశ్వంత్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శేఖర్‌స్వామి, వెంకటరమణారెడ్డి, నాగరాజు,పెద్ద సంఖ్యలో అభిమానులు ఉన్నారు.

## ఎమ్మెల్యే ఆనంతోనే అభివృద్ధి సాధ్యం



**సైదాపురం, డిసెంబరు 31, ప్రభాతవార్త:** మాజీ మంత్రి వర్యులు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డితోనే అభివృద్ధి సాధ్యమని మండల వైసీపీ నాయకులు తెలిపారు. మండల కేంద్రమైన సైదాపురంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఎక్కువ భాగం అడవులు, మెట్ట కొండకింద ప్రాంతాల్లో జీవనం సాగిస్తూ నాగరిక ప్రపంచానికి అనాథిగా ఉండిన తమ ప్రాంతాలను ఆనం కుటుంబం రాజకీయ ఆగమనంతోనే అభివృద్ధి సాధ్యపడిందని వారు తెలిపారు. అధికార, ప్రతిపక్ష పార్టీలతో ప్రమేయం లేకుండా ప్రతి నివాస ప్రాంతానికి తాగునీరు, సాగునీటి కోసం మా రైతాంగానికి సంపూర్ణ హక్కు సాధించేందుకు నాడు తన ఆమరణ నిరాహార దీక్ష ద్వారా ప్రభుత్వాలను కనువిప్పు కలిగించిన చరిత్ర ఆనం రామనారాయణరెడ్డిదేనన్నారు. అయితే చరిత్ర కలిగిన ఆనం కుటుంబంపై రాజకీయ పగటి వేషగాళ్లు మిడిమిడి జ్ఞానంతో విమర్శించడం సరైన పద్ధతి కాదని తెలిపారు. రాష్ట్ర సంగీతం అకాడమీ చైర్‌పర్సన్ పొట్టేళ్ల శిరీష స్థాయిని మరిచి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిని విమర్శించడం తగదని, అలాంటి విమర్శలు చేస్తే ఒప్పుకునే పరిస్థితి లేదన్నారు. జెడ్పీటీసీ సభ్యులు చిత్తులూరు పోలయ్య, వెంకటగిరి యువజన నాయకుడు కొండూరు యోగిరాజు, సీనియర్ నాయకులు సురేష్‌బాబు, కార్తీక్‌రాజు, సుబ్బారెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముక్తియార్‌కు మాజీ సియం చంద్రబాబు ప్రశంశ



**రాపూరు, డిసెంబరు 31 ప్రభాతవార్త** రాపూరు పట్టణపార్టీ ఆధ్యక్షుడు, తిరుపతి పార్లమెంటు మైనారిటీ ఉపాధ్యక్షుడు షేక్ ముక్తియార్ నుతెలుగుదేశం పార్టీ జాతియ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంశించారు. కోవూరులోజరిగిన మాజీ సియం పాదయాత్రలో ఇందుకూరుపేట మండలం పల్లెపాడు, కుడితిపాళెం గ్రామాల అబ్జర్వర్‌గా నియమితులైన ముక్తియార్ పెద్ద ఎత్తున టిడిపి నాయకులను సభకు తరలించడంతో మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. తనను అబ్జర్వర్‌గా నియమించిన మాజీ ఏమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణకు ముక్తియార్ ధన్యవాదాలు తెలిపారు.

## ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యలయం తరలింపునకు రంగం సిద్ధం



**రాపూరు, డిసెంబరు 31 ప్రబాతవార్త** సుమారు 35 సంవత్సరాలుగా రాపూరు కేంద్రంగా వున్న ప్రోహిబిషన్ అండ్ ఏక్సైజ్ సర్కిల్ కార్యలయాలన్నిపోదలకూరుకు తరలించేందుకు రంగం సిద్ధం అయిపోయింది. గత ఎన్నో సంవత్సరాలుగా రాపూరు కేంద్రంగాపోదలకూరు, చేజర్ల, రాపూరు మండలాలకు సంబందించి రాపూరులో సర్కిల్ కేంద్రం వుంది. అయితీ ఇటివల ఏమిజరిగిందో తెలియదు కాని అధికారులు అత్యంత గోప్యంగా ఈ సర్కిల్ కార్యలయాన్ని పోదలకూరు తరలించేందకుఉన్నతాధికారులకు ప్రతిపాధనలు పంపి ఈ మేరకు అనుమతులు రావడంతో కార్యాలయం ఏర్పాటు చేసేందుకు పోదలకూరులో ఒక నివాస గృహాన్ని అద్దేకు కూడా తీసుకున్నట్లు తెలిసింది. నూతన సంవత్సరం తోలి వారం ఈ కార్యలయాన్ని తరలించేలా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డిరాపూరు కేంద్రంగా పిఆర్,ఆర్‌డబ్యూఎస్ డివిజన్ కేంద్రాలను నూతనంగా ఏర్పాటు చేయించారు. దీంతో పాటురాపూరు కేంద్రంగా సర్కిల్ కార్యలయం కూడా ఏర్పాటు చేయించారు. ఈ క్రమంలో రాపూరు నుండి ప్రోహిబిషన్ సర్కిల్‌కార్యలయం తరలిపోకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటారో అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎన్నో సంవత్సరాలుగారాపూరులో వున్న ప్రోహిబిషన్ అండ్ సర్కిల్ కార్యాలయాన్ని రాపూరులోనే వుండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## నిన్ను నేరుగా కలవాలనుకున్నా.. రాలేకపోతున్నా

**నెల్లూరు డిసెంబర్ 31, ప్రభాతవార్త-వైద్యం** గత కొద్ది రోజుల క్రితం దాడికి గురై చికిత్స పొందుతున్న తెలుగుదేశం పార్టీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డిని నెల్లూరు జిల్లా పర్యటనకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి నారా.చంద్రబాబునాయుడు పర్యటన ముగించుకుని వెళ్తున్న తరుణంలో శనివారం కోటంరెడ్డికి ఫోను చేసి అనేక కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉందని దానివల్ల నిన్ను నేనుగా నేరు కలవలేకపోతున్నందుకు బాధగా ఉందని అన్నారు. నేను ఎప్పుడూ నీకు అండగా ఉంటానని ఆయనకి భరోసా కల్పించారు. ఆరోగ్యం నుండి త్వరగా కోలుకుని ప్రజల్లోకి వెళ్ళాలని ఆయన కోరారు. నగర నియోజకవర్గంలో తన సతీమణి ఇదేం ఖర్మ-మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని తన భార్య నిర్వహిస్తుందని కోటంరెడ్డి చంద్రబాబుకి చెప్పగా మీరు చేసే కార్యక్రమాలకు అండగా ఉంటానన్నారు. మీ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని చంద్రబాబు అన్నారు.

## ఎస్‌టీవో కార్యాలయంలో ముందస్తు వేడుకలు



**కోవూరు, డిసెంబరు31 ప్రభాతవార్త :** కోవూరులోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో రానున్న నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శనివారం కార్యాలయంలో సబ్ ట్రెజరీ అధికారి కిరణ్‌కుమార్‌ను ఉద్యోగస్తులు శాలువా, పూలమాల బొకేలతో ఘనంగా సత్కరించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసుకుని స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులంతా సమిష్టిగా పాల్గొన్నారు.

## ప్రయాణీకులకు స్థలం ఇవ్వండి



**ఆత్మకూరు,డిసెంబర్31ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణంలో ప్రయాణీకులకు విశ్రాంతి నిలయంలో ప్రయాణీకుల విశ్రాంతి నిలయంలో ప్రయాణీకులకు చోటు ఇవ్వాలని సిపిఎం పార్టీ ఆధ ్వర్యంలో మున్సిపల్ కమీషనర్ రమేష్‌బాబుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ బస్టాండు వద్ద నిర్మాణంలో ఉన్న ప్రయాణీకుల విశ్రాంతి నిలయంలో ప్రయాణీకులు సేద తీరేందుకు వాహనాల కోసం నిరీక్షించేందుకు వారికి ఎక్కువ స్థలం కేటాయించాలని వారు కోరారు. సిపిఎం ఆత్మకూరు కార్యదర్శి డేవిడ్‌రాజు, జిల్లా కౌలురైతు నాయకులు జి.లక్ష్మీపతి, మాజీ వైస్‌చైర్మెన్ సందాని , ఆవాజ్ కమిటీ అధ్యక్షుడు యస్దానిబాషా, కెవిపిఎస్ సభ్యులు హాజరయ్యారు.

## సిఐ గిరిబాబుకు అవార్డు అందజేసిన ఎస్‌పి



**ఉదయగిరి డిసెంబర్ 31 ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన వివిద కేసులలో పురోగతి సాధించి బాధితులకు న్యాయం చేకూర్చ డంలో ఉత్తమ ప్రతిభ కనబరచినందుకు జిల్లా ఎస్‌పి సిహెచ్ విజయరావు చేతుల మీదుగా ఉదయగిరి సర్కిల్ ఇనస్పెక్టర్ వి.గిరిబాబు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా సి.ఐ గిరి బాబు మాట్లాడుతు ఉదయగిరి సర్కిల్ పరిధిలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అసాంఘిక కార్యక్రమాలకు తావు లేకుండా ప్రెండ్లి పోలీస్ వ్యవస్థను ప్రజలకు చేరువ చేస్తు తన సిబ్బందితో ఉదయగిరి సర్కిల్ పరిధిలో గట్టిబందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రెండ్లి పోలీస్ వ్యవస్థ ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు పోలీసులతో మమేకమై నేరస్తుల వివరాలు అందించి పోలీస్ వ్యవస్థకు సహకరించాలని కోరారు.

## చంద్రబాబునాయుడుని కలిసిన గుర్రం సునీల్



**కావలి రూరల్, డిసెంబరు 31 ప్రభాతవార్త** ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా కావలికి విచ్చేసిన మాజీ ముఖ్య మంత్రి,తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుని నెల్లూరు పార్లమెంటు యువత ఉపాధ్యక్షులు కావలి రూరల్ మండలం చలంచర్ల గ్రామానికి చెందిన గుర్రం సునీల్ మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబుని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి పూలబొకె అందజేశారు. గుర్రం సునీల్‌ని ఈ సందర్భంగా నారా చంద్రబాబునాయుడు ఆప్యాయంగా పలకరించి రాబోయేది తెలుగుదేశం పార్టీ పాలన అని ఇప్పటి నుంచే మీలాంటి యువత శక్తివంచన లేకుండా కృషి చేయాలని చెప్పారన్నారు. కావలి రూరల్ మండలంలో పార్టీ గురించి అడిగి తెలుసుకున్నారని తెలిపారు.

## వీరంపల్లి మాజీ సర్పంచ్ బెల్లంకొండ పోలయ్య ఆకస్మిక మృతి



**మనుబోలు, డిసెంబరు 31 ప్రభాతవార్త** మనుబోలు మండలంలోని వీరంపల్లి మాజీ సర్పంచ్ బెల్లంకొండ పోలయ్య(70) ఆకస్మికంగా మృతి చెందారు. బ్రైన్ స్ట్రోక్‌తో ఆయన చనిపోయినట్లు బంధువులు తెలిపారు. వీరంపల్లి పంచాయతీలో 2000 సంవత్సరం నుండి 2005 వరకు సర్పంచ్‌గా పనిచేసి గ్రామంలో ముఖ్యమైన అభివృద్ధి పనులు చేసి గ్రామంలో మంచిపేరు తెచ్చుకున్నారు. ఆయనకు నలుగురు కుమార్తెలు. పోలయ్య మృతి పట్ల ఆ గ్రామ సర్పంచ్ దానరాసి సుధాకర్, ఎంపిటిసి తాటిపర్తి రాగయ్యలు సంతాపం ప్రకటించారు. ఆయన అన్ని రాజకీయ పార్టీ నాయకులకు సుపరిచితుడు. శనివారం ఆయన అంత్యక్రియలు పూర్తి చేశామని బంధువులు తెలిపారు.

## ముగ్గురు మాజీ చైర్మన్లతో చంద్రబాబు ముచ్చట్లు



**కావలి, డిసెంబరు 31 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కావలి బృందావనం హౌసింగ్ కాలనీలో బాబు బస చేసిన బస్సులో ముగ్గురు మాజీ మున్సిపల్ చైర్మన్లతో ముచ్చటించిన సంఘటన వైరల్‌గా మారింది. కావలి మాజీ మున్సిపల్ చైర్మన్, ప్రముఖ సర్జన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు, మాజీ మున్సిపల్, ఎయంసి చైర్మన్ గ్రంధి యానాదిశెట్టి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్యలు ముగ్గురుతో చంద్రబాబు ముచ్చటించారు. మళ్లీ మనమే అధికారంలోకి వస్తున్నామని తెలుగుదేశం పార్టీ విజయదుందుభికి మీరంతా పాటుపడాలని చంద్రబాబునాయుడు కోరారు.

## విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ



**ఆత్మకూరు,డిసెంబర్31 ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణంలోని జడ్పీ హైస్కూల్లో శనివారం 8వ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు 20వ వార్డ్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కొరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో మంచి ఆశయంతో విద్యార్థులకు ఈ ట్యాబ్‌లను పంపిణీ చేశారని వీటిని ఉపయోగించి విద్యను పెంపొందించుకొని మంచి మార్కులు సాధించి మంచి భవిష్యత్తును పొందాలని తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు .

## ప్రధానోపాధ్యాయుడికి ఘన సన్మానం



**మర్రిపాడు,డిసెంబర్31ప్రభాతవార్త:** మండలంలోని చుంచులూరు ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తూ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందిన పారంశెట్టి పద్మాకర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు , గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్‌ప్రధానోపాధ్యాయుడు రమేష్ మాట్లాడుతూ 37సంవత్సరాల ఉద్యోగ జీవితంలో పలు పాఠశాలల్లో ఎంతో నిబద్ధతతో , అంకితభావంతో పనిచేసి ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దారని, ప్రధానోపాధ్యాయులుగా చుంచులూరు ఉన్నతపాఠశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని వారి సేవలను ఘనంగా కొనియాడారు. పద్మాకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మెన్ విష్ణుకుమార్‌రెడ్డి, ఎంఆర్‌జి రాజేంద్రకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు మురళీకృష్ణ, అశోక్, రేవతి, రబ్బాని , మాధవరావ్, సురేంద్ర, ఖాజా రసూల్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకలకు సర్వం సిద్ధం

**మనుబోలు, డిసెంబరు 31 ప్రభాతవార్త** నూతన సంవత్సరానికి ఘనస్వాగతం పలికేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధమయ్యారు. ఈ ఏడాది నూతన సంవత్సరం ఆదివారం రావడం విశేషం. కొత్త సంవత్సరంలో భక్తుల కొరకు అనేక దేవాలయాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ శుభం జరగాలని కోరుకుంటూ అన్ని దేవాలయాలలో భక్తులు దర్శించుకునేందుకు సకలం సిద్ధం చేసుకున్నారు. కోదండరాంపురం, మనుబోలులో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ పలు పార్టీల నాయకులు ప్లెక్సీలు ఏర్పాటు చేయడం విశేషం. పోటాపోటీగా ప్లెక్సీలు పెట్టారు. వైసిపి నాయకులు, రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఫోటోలు పెట్టి నూతన సంవత్సర గ్రీటింగ్స్ చెప్పడం పలుచోట్ల కనిపించింది. వెంకన్నపాళెం, పిడూరు పాలెం,బద్వేలు,కట్టువపల్లి గ్రామాల్లో కూడా ఈసారి నూతన సంవత్సరానికి పెద్దఎత్తున శుభాకాంక్షలు చెబుతూ ప్లెక్సీలు ఏర్పాటు చేశారు. కోదండరాంపురంలో అనేక మంది యువకులు నూతన సంవత్సర గ్రీటింగ్స్ చెబుతూ రోడ్లలో సందడి చేశారు.

**In the Court of the 1st Addl. District Judge :: Nellore**
I.A.No.38/2022
O.S.No.195/2017
**1.Angeeru Priyanka and another** ...Petitioners/Plaintiffs
Vs
**Devisetty Krishnaiah (died) and Others** ...Respondents/ Defendants
**1.Devisetty Venkata Sainath**
**2.Devisetty Usha**
...Respondents/ LR's of 1st Defendant
**Notice**
To,
**R1: Devisetty Venkata Sainath** S/o. Late Krishnaiah
**R2: Devisetty Usha** D/o. Late Krishnaiah, R1&R2 are residing at Ramathirtham, Vidavaluru Mandal, SPSR Nellore District.
పై నెంబరున పిటిషనర్లు/వాదులు O.S.No.195/ 2017 అను దావాలో 1వ ప్రతివాది అయిన దేవిశెట్టి క్రిష్ణయ్య చనిపోయినందున, ఆయన వారసులుగా మిమ్మల్ని చేర్చమని కోరుతూ పై తెలిపిన కోర్టులో యల్.ఆర్ పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే.02-01-2023దికి** వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
**వేళ్ళ ఉపేంద్రరావు,** బి.కాం., బి.యల్.,
పిటిషనర్లు/వాదులు తరపు అడ్వకేట్, నెల్లూరు

